17072024-MAI-04_Layout 1 7/17/2024 2:40 AM Page 1



'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

**నమస్తే తెలంగాణ**

# ఎగవేతల రుణమాఫీ

*అర'చేతి'లో వైకుంఠం చూపి ప్రజలను ఆగమాగం చేసి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ ఓడమల్లయ్య సామెతను పదే పదే గుర్తు చేస్తున్నది. గ్యారంటీల పేరుతో అన్నివర్గాలకు ఆశజూపి ఓట్లు గుంజుకున్నది. తీరా అధికారంలోకి వచ్చాక మొండిచెయ్యి చూపిస్తున్నది. ఈ ధోరణి అన్ని వర్గాల కన్నా ఎక్కువగా రైతాంగాన్ని దెబ్బతీస్తున్నది. 'అందరికీ అన్ని' అని ఊరించి ఇప్పుడు నింపాదిగా 'కొందరికే కొన్ని' అంటూ కొర్రీల మీద కొర్రీలు పెడుతున్నది. తాజాగా రుణమాఫీపై జారీచేసిన మార్గదర్శకాలే ఇందుకు ఒక ఉదాహరణ. ఈ మార్గదర్శకాలు దారి చూపేందుకు కాదు, అత్యధికులకు దారిని మూసేందుకు ఉద్దేశించినవి. వీటి వెనుక ఎంతమందికి ఎగ్గొట్టాలా? అనే ఆలోచన తప్ప మరేమీ లేదని స్పష్టమవుతుంది. రేషన్‌కార్డు (ఆహార భద్రత కార్డు) ఆధారంగా 'కుటుంబం' గుర్తింపు అంటే ఎంతమంది ఎగిరిపోతారో ఊహించుకోవచ్చు. కుటుంబంలో ఎందరు రైతులున్నా అందరికీ కలిపి మాఫీ పరిమితి రెండు లక్షలే. కొన్నేండ్లుగా కొత్త రేషన్‌కార్డులే లేవన్న సంగతి ప్రభుత్వానికి తెలియదా? రుణమాఫీపై సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన వివరణ విచిత్రంగా ఉంది. కుటుంబాన్ని గుర్తించేందుకు మాత్రమే రేషన్‌కార్డు, మాఫీ మాత్రం పాస్‌బుక్ ఆధారంగానే జరుగుతుందని అంటున్నారు. అంటే కార్డు పేరిట వడపోతలుండవని ఆయన అనడం లేదనేది గమనించాలి.*

*ఇక పీఎం కిసాన్ నిబంధనల వర్తింపు మరో వడపోత. అంటే ప్రస్తుత, మాజీ ప్రభుత్వ ఉద్యోగులకు రుణమాఫీ హుళక్కే. ఆదాయ పన్ను చెల్లింపుదారులు, వైద్యులు, న్యాయవాదులు, ఇంజినీర్లకూ వర్తించదు. బ్యాంకుల నుంచి 29 అంశాలపై వివరాలు సేకరిస్తున్నారంటేనే తెలుస్తుంది.. ఎన్నిరకాలుగా కోతలు పెడుతున్నారో! ఉల్లిపొరల్లాంటి నిబంధనలను ఒకటొకటిగా వలుచుకుంటూ పోతే చివరకు ఏమీ మిగలదని అర్థమవుతూనే ఉంది. సగం మందికైనా రుణమాఫీ దక్కుతుందా అనేది సందేహమే. అత్యధికులకు లబ్ధి చేకూరకుండా చేసేందుకే మార్గదర్శకాలను విడుదల చేశారని తెలుసుకునేందుకు పెద్దగా ఆలోచించాల్సిన అవసరం లేదు. రేపుమాపని వాయిదాల మీద వాయిదాలు పెట్టి చావుకబురు చల్లగా చెప్పినట్టు ఇప్పుడు అడ్డగోలు నిబంధనలతో అమలు చేస్తున్నారు.*

*స్వరాష్ట్ర సాధన తర్వాత తొమ్మిదిన్నరేండ్ల పాటు పచ్చగా కళకళలాడిన సాగు నేడు విషమ పరిస్థితిలో కూరుకుపోతున్నది. రైతుల పట్ల కాంగ్రెస్ కక్ష సాధింపు ధోరణికి పాల్పడుతున్నది. వ్యవసాయాన్ని అష్టదిగ్బంధనంలో పెడుతున్నది. ఎన్నో కడగండ్లకు ఓర్చి సాగుచేసే అన్నదాతకు కృతజ్ఞతగా సమర్పించుకోవాల్సిన రుణమాఫీతో కాంగ్రెస్ చెలగాటమాడుతున్నది. మరోవైపు కరెంటుకు, సాగునీటికి యాతన తప్పడం లేదు. విత్తనాలు, ఎరువుల కోసం బారులుతీరి నిలబడాల్సిన పరిస్థితి మళ్లీ వచ్చిపడింది. పండించిన పంట చివరి గింజదాకా కొంటారన్న భరోసా లేదు. అన్ని పంటలకూ బోనస్ అన్నవారు ఇప్పుడు ఆ ఊసెత్తడం లేదు. అందుకే మోసపోయి గోసపడుతున్నం అని రైతులు వాపోతున్నారు. పంటకు ముందు ఠంచనుగా ఖాతాలో పడాల్సిన రైతుబంధు కోతలైన తర్వాత కూడా అందడం లేదు. రైతుబంధు మొత్తాన్ని పెంచుతామని ఇచ్చిన హామీకి ఇంతవరకు అతీగతీ లేదు. పైగా అక్కడా కొర్రీలు వేయాలని సర్కారు చూస్తున్నది. ప్రతిరైతుకూ పంటసాయం, అంటే రైతుభరోసా అందించాల్సిందేనని, లేకపోతే వేల ఎకరాలు పడావు పడతాయని వరంగల్ మహిళా రైతు రమాదేవి చేసిన హెచ్చరికను ప్రభుత్వం చెవికెక్కించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేకపోతే ఆహార ఉత్పత్తిలో అగ్రగామిగా నిలిచిన తెలంగాణ అధఃపాతాళానికి పడిపోవడం ఖాయం. ఇందుకు బాధ్యత వహించాల్సింది కాంగ్రెస్ ప్రభుత్వమే!*

**సైనికులు మరణిస్తున్నా పట్టించుకోరా?**



**దేశ సరిహద్దుల్లో నిత్యం మన సైనికులు మరణిస్తున్నారు. గత ఆరేండ్లుగా జమ్ముకశ్మీర్‌ను పాలిస్తున్న కేంద్రప్రభుత్వం ఏం చేస్తున్నది. కనీసం దర్యాప్తు కూడా చేయడం లేదు. పైగా అందుకు ఇక్కడి రాజకీయ పార్టీలే కారణమని ఆరోపణలు చేస్తూ.. అమాయక ప్రజలు, జర్నలిస్టులను జైలులో వేస్తున్నది.**

**- మెహబూబా ముఫ్తీ,**
జమ్ముకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి

# జీవాత్మలు-ప్రేతాత్మలు



**డాక్టర్ చెన్నమనేని హన్మంతరావు**
98490 18120

**మహా ఘనత వహించిన ఒక జీవాత్ముడు మొన్న హైదరాబాద్ వచ్చి వెళ్లాడు. ఎందుకు వచ్చి వెళ్లాడో, అంతరార్థం ఏమిటో తెలియదు. ఊరక రారు కదా మహాత్ములు. ఆ ఆత్మకు తెలంగాణ, ఆంధ్రలు రెండు కండ్లట. నిజమే ఒకటి శీతకన్ను, వేరొకటి వేడి నీటి కన్ను. ఆ ఆత్మ తెలంగాణపై శీతకన్నేస్తూనే ఉంటుంది. వేరొక కన్నుతో ఈర్ష్యా అసూయలతో వేడి నీటిని చిమ్ముతూనే ఉంటుంది. ఆ కళ్లు ఎంత పవర్‌ఫుల్ అంటే పిల్లనిచ్చినవాన్ని కూడా అధఃపాతాళ లోకాలకు తొక్కే శని చూపు కలవి.**

పదేండ్లయిపోయాయి ఇక ఇటువైపు ఆ చూపు పడదనుకున్నాం. కానీ, దొంగలించిన ప్రాణం, చూపు మరోసారి ఇటు మళ్లింది. ఇక్కడో శిష్యుడు. పాతాళ భైరవి మాంత్రికునికి ఉన్నట్టు ఒకడున్నాడు. ఈ ఇద్దరు గురుశిష్యులు కూడా ఆ మాంత్రికునికి, ఆ శిష్యునికి ఏ మాత్రం తీసిపోరు. ఏ మాత్రం చాన్స్ దొరికినా ఊళ్లకు ఊళ్లే, పట్టణాలకు పట్టణాలే కబళించుకుపోగలరు. 'జై పాతాళ భైరవి' అంటూ ఇప్పుడు ఈ మాంత్రికునికి దేశంలో ఒక యుగ పురుషుడు తోడయ్యాడు. ఈ యుగ పురుషుడు తనకు తాను అవతార పరుషుడనుకొంటాడు, కానీ మొన్న ప్రజలు నెత్తిపై మొట్టికాయలు మొత్తి నీవు యుగ పురుషుడవు కావు కాపురుషుడవని చెప్పారు. దీంతో దేశం బతుకు జీవుడా అంటూ ఊపిరి తీసుకుంటున్నది. పైన చెప్పిన మాంత్రికుడు రెండు రాష్ట్రాలు రెండు కళ్లంటూ 7 మండలాలు దొబ్బిపొయ్యాడు, రాష్ట్రం పుట్టీ పుట్టకముందే. ఇప్పుడు తన శిష్యుని మంత్రదండంతో ఏం చేస్తాడో తెలియదు. మొన్ననే ఒక రచయిత్రి తన వ్యంగ్య రచనలో పై జీవాత్మను పరకాయ ప్రవేశం చేయించారు. ఆ ఆత్మ వందల ఏండ్ల నుంచి తెలంగాణకు సేవ చేసిన అందరిలో ప్రవేశించి హైదరాబాద్‌ను కట్టి పడేసిందట. ఆఖరికి నిజాం నవాబుల్లో కూడా ప్రవేశించి హైదరాబాద్‌ను తీర్చిదిద్దిందట. నిజాం నవాబులు వెళ్లిపోయాక ప్రేతాత్మలా ఇప్పుడు శీతకన్ను, వేడి నీటి కళ్లతో మళ్లీ అభివృద్ధి పరుస్తోంది అట. (పరిచిందట!) ఈ అభివృద్ధి భరించలేక మళ్లీ తెలంగాణీయులు వలసపోవాలేమో. 'జై తెలంగాణ' అని ఒక్కసారి కూడా అనని ఆ ఆత్మ శిష్యులు కొలువుదీరి ఉండటం వారి అదృష్టం. తెలంగాణ ప్రజల దురదృష్టం. పదేండ్లయినా ఈ దరిద్రం కదలక పడగలు సాచటం ఎంత దురదృష్టం. ఈ ఆత్మలకు దేవుడంటే భయం, భక్తి ఏమీ లేవు. వెనుకటికి ఒకాయనా ఆయన అంతే వాసి, ఏడుకొండల వాడికి ఏడు కొండలెక్కడివి రెండే కొండలన్నాడు. అంతే! ఆయన ఆ కొండలల్లో కల్సిపోయాడు. ఇప్పుడు వర్ణిస్తున్న ఆయన కూడా ఏడుకొండల వాడిపై ఏదో కూసి చావుతప్పి శీతకన్ను, వేడి కన్నులతో బతికి బయటపడ్డాడు. అంతటి పవర్‌ఫుల్ కళ్లు అవి. ఎప్పటికి మంది సొమ్ము తమవారికి ఎలా దోచిపెట్టాలనే తపనే! (తమ రాష్ట్రానికి కాదు).

**కానీ, బిడ్డల్లారా! ఇల్లలుకగానే పండగ కాదు. తెలంగాణ ఎప్పటికీ ఉద్యమాలు చేసే గడ్డనే! ఒక్కసారి గాలి వీస్తే ఊబిది లేచిపోయి నిప్పు కణం బయటికి వచ్చి దుష్టచతుష్టయాలను, శకునులను మాడ్చి మసిచేస్తాయి.**

పక్క రాష్ట్రం నుంచి వచ్చి రాజకీయాలు చేస్తామంటే కుదరదు, జాగ్రత్త. ఈ రాష్ట్రంలో బతుకుదెరువు చూసుకొని బతుకుతున్న సీమాంధ్రులతో మా వంటి అసలు తెలంగాణీయులకు పేచీ ఏమీ లేదు. వారితో మేము ఎప్పుడో కల్సిపోయాం. కానీ ఎప్పటికి పక్కవాడిని ఎలా మోసం చెయ్యాలా? ఎలా దోపిడీ చేయాలా? అని ఆలోచిస్తూ రాజకీయాలు చేస్తున్న దురాత్ములతోనే చిక్కు. రాజకీయం చేసేవాళ్లు తెలంగాణ నుంచి వెళ్లిపోయి మీ ఊర్లో, మీ రాష్ట్రంలో రాజకీయాలు, ఆ భాగోతాలు ఆడుకొండి. మాకేం అభ్యంతరాలు లేవు. మా బతుకు మమ్మల్ని బతుకనీయండి. డబ్బులిచ్చి బాకాలూదించుకునే మీడియా, డబ్బులిచ్చి డబ్బా కొట్టించుకునే శిష్య ప్రశిష్యులతో అక్కడ విర్రవీగండి. ఇక్కడ ఎలాంటి వెర్రి చేష్టలు చేసినా ఉద్యమంలో పాల్గొన్నవారు (మా వంటి వారు) ఇంకా బతికే ఉన్నారు జాగ్రత్త.

వెరసి తెలంగాణ తమ్ముళ్లకు, అక్కాచెల్లెళ్లకు చెప్పేదేమిటంటే శత్రువులు మనల్ని వెన్నాడుతున్నారు. ఇంకా బతికే ఉన్నారు. ఏమరుపాటున ఉంటే ఏమవుతుందో.. అసలు తెలంగాణ వాదులు చేసిన అభివృద్ధి, నకిలీ తెలంగాణ



వాదులు చేసే అభివృద్ధి చూశారు, చూస్తున్నారు, అనుభవిస్తున్నారు. ఏమరుపాటున ఉంటే మరోసారి నీళ్లు, నిధులు, నియామకాలు ఉష్‌కాకి! అన్న మాయమవుతాయి.

**అప్పటికి మాలాంటి వృద్ధులు ఉండకపోవచ్చు. కానీ, ఏమైనా జరిగితే మా ఆత్మలు ఘోషిస్తాయి. అలా జరగకుండా జాగ్రత్తపడండి. అప్రమత్తంగా ఉండండి. అన్యాయాలను చీల్చి చెండాడే సమయం కోసం వేచి చూస్తూ ఉండండి.**

# రుణమాఫీకి రేషన్‌కార్డు పీటముడి

**2 లక్షల రూపాయల దాకా ఉన్న రైతుల పంట రుణాలను ఆగస్టు 15లోగా మాఫీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పార్లమెంట్ ఎన్నికల వేళ పదే పదే ప్రకటించారు. కానీ, ఆచరణకు వచ్చేసరికి ఆయన మాటలకు, చేతలకు పొంతనే లేదు. ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన మార్గదర్శకాల జీవో నెం.567 ద్వారా ఈ విషయం స్పష్టమవుతున్నది. రైతులందరికీ, వారి పేరిట బ్యాంకు ఖాతాలో ఉన్న రుణం ప్రకారం మాఫీ వర్తిస్తుందని చెప్పిన హామీకి ఇప్పుడు 'కుటుంబం' అనే మాట అడ్డు తగులుతున్నది. వ్యవసాయ భూమి ఉన్నవారికి పట్టా పాస్‌బుక్ ఆధారంగా బ్యాంకు పంట రుణాలను మంజూరు చేస్తుంది. ఒక్క కుటుంబంలో ముగ్గురి పేరిట భూమి ఉంటే బ్యాంకు ఆ ముగ్గురికి విడివిడిగా రుణం ఇస్తుంది. పంట రుణానికి, కుటుంబానికి, కుటుంబంలో ఉన్న సభ్యుల సంఖ్యకు అసలు ఎలాంటి సంబంధం లేదు.**



**బి.నర్సన్**
94401 28169



రుణమాఫీ కోసం రైతు కుటుంబాన్ని గుర్తించేందుకు రేషన్‌కార్డు ప్రామాణికమని ప్రభుత్వ ఉత్తర్వులో ఉంది. ఇంకా వివరంగా చెప్పాలంటే.. పౌరసరఫరాల శాఖ నిర్వహించే ఆహార భద్రతకార్డు (పీడీఎస్) డేటాబేస్ ప్రామాణికమని అందులో ఉంది. నిజానికి రేషన్‌కార్డుకు పంట రుణానికి సంబంధమే లేదు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలకు తెల్లరేషన్ కార్డు కలిగి ఉండటం లబ్ధిదారుల ప్రాథమిక అర్హత. అదే తెల్లకార్డు పరిమితిని పంట రుణమాఫీకి వర్తింపజేయడం గందరగోళాన్ని సృష్టిస్తున్నది. రుణమాఫీకి తెల్ల రేషన్‌కార్డు ప్రామాణికమని కొన్ని పత్రికలు పతాక శీర్షిక పెట్టగా.. వార్తల్లో మాత్రం కుటుంబాన్ని గుర్తించడానికే రేషన్‌కార్డు అని మంత్రి తుమ్మల అన్నట్టు ఉంది. అంటే అన్నిరకాల రేషన్‌కార్డులను కేవలం రైతు కుటుంబ సభ్యుల లెక్కింపు కోసం పరిగణనలోకి తీసుకుంటామనే అర్థం ఆయన మాటల్లో కనిపిస్తున్నది.

బ్యాంకుల నుంచి పంట రుణాల వివరాలు సేకరించి, రేషన్‌కార్డు ఆధారంగా వారి కుటుంబాన్ని నిర్ధారించి, ఆ కుటుంబంలోని సభ్యులందరికీ కలిపి బ్యాంకు ఇచ్చిన రుణంలో రెండు లక్షల దాకా రుణమాఫీ వర్తించేటట్టు ప్రభుత్వ మార్గదర్శకాలు ఉన్నాయి. ప్రతి రైతుకు రెండు లక్షల రూపాయల స్వల్పకాలిక పంట రుణమాఫీ అన్న హామీ మొదటికే మోసమై.. ఇప్పుడు రైతు కుటుంబానికి రూ.2 లక్షల పంట రుణమాఫీగా మారిపోయింది. ఇంతవరకు ఏ రుణమాఫీలో పెట్టని నిబంధన ఇది. దీని వల్ల రెండు రకాలుగా రైతులు నష్టపోతారు. కొత్త రేషన్‌కార్డుల పంపిణీ, పాత వాటిలో మార్పులు, చేర్పులకు అవకాశం లేనందు వల్ల విడిపోయిన రైతు కుటుంబాల పేర్లు ఒకే కార్డులో ఉన్నాయి. ఉదాహరణకు ఒక కుటుంబంలోని అన్నదమ్ములు విడిపోయి, భూమి పంచుకొని సొంత కుటుంబాల కోసం వ్యవసాయం చేస్తున్నా.. కార్డులో మాత్రం కలిసే ఉంటారు. బ్యాంకుల ద్వారా తండ్రి, ఇద్దరు కొడుకులు విడిగా చెరో రెండు లక్షలు అప్పు తీసుకున్నా, ప్రభుత్వ నిబంధనల ప్రకారం తండ్రి తీసుకున్న రుణం మాఫీ అవుతుంది. కానీ, కొడుకులకు మాత్రం ఎలాంటి ప్రయోజనం చేకూరదు. ఈ లెక్కన బ్యాంకులో అప్పు తీసుకున్న ప్రతి రైతుకు రెండు లక్షల దాకా మాఫీ అవుతుందని నమ్మినవారు దెబ్బతిన్నట్టే. మాఫీ కోసం వెంటనే కొత్త రేషన్‌కార్డు పొందే అవకాశమూ లేదు. గత కొన్నేండ్లుగా తెలంగాణలో కొత్త రేషన్‌కార్డుల పంపిణీ, పాత వాటిలో మార్పులు జరగలేదు. అంటే కుటుంబాలు విడిపోయినా, రేషన్‌కార్డులో మాత్రం కలిసే ఉన్నారు. కొత్త రేషన్‌కార్డు కోసం రాష్ట్రంలో ప్రస్తుతం 9 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రతి రైతు రుణానికి మాఫీ వర్తింపజేయకపోగా పదేండ్ల కిందటి రేషన్‌కార్డును ప్రామాణికంగా తీసుకోవడమంటే దగా చేయడమే. కుటుంబం ప్రాతిపదికను పక్కనబెట్టి బ్యాంకులో రుణం తీసుకున్న ప్రతి రైతుకు ఈ ప్రయోజనం అందాలి.

అంతేకాదు, రీషెడ్యూల్ అయిన పంట అప్పులకు, జాయింట్ లయబిలిటీ గ్రూపులకు, లోన్ ఎలిజిబిలిటీ కార్డు ద్వారా రుణం పొందినవారికి రుణమాఫీ వర్తించదని జీవోలో ఉంది. కరువు ప్రాంతాలుగా ప్రకటించిన మండలాల్లో బ్యాంకులు పాత రుణాలను రీషెడ్యూల్ (వాయిదా పద్ధతిలో చెల్లించే అవకాశం) చేసి కొత్త పంట రుణాలను ఇస్తాయి. అంటే రీషెడ్యూల్ చేసిన పంట రుణాలకు న్యాయంగా ఈ మాఫీ వర్తించాలి. ఇక జేఎల్‌జీల విషయానికొస్తే.. ఎకరంలోపు భూమి ఉన్న రైతులు కలిసి ఒక గ్రూపుగా ఏర్పడి తీసుకొనే పంట అప్పు విధానం అన్నమాట. పది, పదిహేను మంది సన్నకారు రైతులకు విడివిడిగా రుణాలు ఇవ్వడం వల్ల బ్యాంకులపై పని భారం పెరుగుతుందని, దాన్ని తగ్గించేందుకే కేంద్ర ప్రభుత్వం ఈ గ్రూపుల ఏర్పాటుకు అనుమతునిచ్చింది. వీటికి అర్హత లేకపోవడమంటే చిన్నరైతుల నడ్డి విరవడమే.

కౌలు రైతులు బ్యాంకు రుణాలు పొందడానికి లోన్ ఎలిజిబిలిటీ కార్డు (ఎల్‌ఈసీ)ని రెవెన్యూ అధికారులు అందజేస్తారు. తమ భూమిలో ఆ యేడు పంటలు వేసేందుకు సదరు కౌలు రైతుకు అనుమతినిస్తున్నామని భూ యజమాని ఇచ్చే ధృవీకరణతో ఎల్‌ఈసీ జారీ చేస్తారు. ఆ కార్డులోని వివరాల ఆధారంగా సదరు కౌలురైతుకు బ్యాంకులు ఒక సంవత్సరం కాలానికి పంట రుణం మంజూరు చేస్తాయి. బ్యాంకు ద్వారా కౌలు రైతులు పంట రుణం పొందేందుకు కేంద్రం ఇచ్చిన వెసులుబాటు ఇది. అయితే అనవసర భయంతో భూ యజమాని ధృవీకరణకు నిరాకరిస్తుండటంతో ఈ విధానం ఆచరణకు నోచుకోవడం లేదు. నిజానికి ఈ మూడు విధాలుగా బ్యాంకుల్లో ఉన్న రుణ బకాయిలు చాలా తక్కువగానే ఉంటాయి. పైగా రుణమాఫీ పొందేందుకు పూర్తి అర్హత వీరికుంది. నమ్మి ఓటేసిన రైతులకు హామీ మేరకు లబ్ధిని చేకూర్చవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నది. కాబట్టి కుటుంబ నిబంధనను తొలగించి పైన పేర్కొన్న వర్గాలకు కూడా రుణమాఫీ వర్తించేలా 'పంట రుణమాఫీ పథకం- 2024'లో మార్పులు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.



## కలిసిరాని కాలం

**కడుపు మండుతుంది**
**తెలంగాణ అభిమానం నిలబడనిస్తలేదు**
**నక్కసిగ్గుపడే 'నారా'కు ఘన స్వాగతాలు**
**అరాచకాన్ని అడ్డుకుంటే అరదండాలు**
**మేధావుల తలలు తాబేలు డిప్పలో**
**జయశంకర్ సార్ అన్నది నిజమైంది**
**ప్రాంత సోయి లేని వారంతా**
**రొమ్ము విరుచుకుని తిరుగుతున్నరు**
**తెలంగాణ వీరులు అమర్యాదతో**
**అలమటిస్తూ మూగగా రోదిస్తున్నరు**
**పదేళ్ల స్వరాష్ట్రంలో చూసిన స్వర్గం**
**కలలాగా టక్కున మాయమైంది**
**పొలాలు ఎండినై గుండెలు మండుతున్నై**
**పదవులు పొందిన మాజీలు పదవులకై**
**పరువు పొయ్యేట్టు పరుగు తీస్తుంటే**
**నమ్మి ఓట్లేసిన జనం చేష్టలుడిగి చూస్తుంటే**
**పెరుగుట విరుగుట కొరకే**
**ఎక్కువైన ఏదైనా మురిగిపోక తప్పదు**
**కాలం ఒకటున్నది లెక్క చూడక ఉండదు**



**భోజన్నగారి అనసూయ**

# చార్‌ధామ్ నుంచి చార్ దామ్ దాకా!



**ప్రియదర్శిని పటేల్**

**విపరీతమైన వేడిలో దుమ్ము తుపాను లేస్తున్నది. వాహనాలు రహదారిపై కిక్కిరిసిపోయాయి. కుప్పలుగా ఉన్న పడవలతో గంగా నది తీరం రద్దీగా ఉన్నది. ముంబైలోని చౌపట్టీ బీచ్‌లో వలె గంగా తీరంలో ఓ స్థాయిలో ప్లాస్టిక్, చెత్త కుప్పలు కనిపిస్తున్నాయి. ఎత్తైన బంగీ జంప్ గురించిన బోర్డులు, సెల్ఫీలు తీసుకుంటున్న పర్యాటకుల గుంపులు దర్శనమిస్తున్నాయి. 'మునీ కీ రేతి'లో డీజే సంగీతాన్ని వినిపించే పార్కింగ్ స్థలాలున్నాయి. డీలక్స్ స్పాలు, లగ్జరీ హోటళ్లు, ఆసన అభ్యాసకులతో నిండిన అంతర్జాతీయ ఆశ్రమాలు సమీపంలో కనిపిస్తున్నాయి. ఈ దుమ్ము, ధూళితో కూడిన సమ్మర్ధం ఎక్కడో కాదు, యోగా నగరం రిషికేష్ నిండాపరుచుకొని ఉంది. 'ఆధ్యాత్మిక' పర్యాటకం ప్రస్తుత పరిస్థితి ఇది.**

చార్‌ధామ్ యాత్ర ఒకప్పుడు తీర్థయాత్ర. కానీ, ఇప్పుడు అది 'ఆధ్యాత్మిక' పర్యాటకం. ఈ ఏడాది మేలో మొదటి 20 రోజుల్లోనే చార్‌ధామ్‌ను 14 లక్షల మంది పర్యాటకులు సందర్శించారు. ఉత్తరాఖండ్ ప్రభుత్వం కేదార్‌నాథ్‌కు రోజుకు 18,000 మంది, గంగోత్రికి 11,000, బద్రీనాథ్‌కి 20,000, యమునోత్రికి 9,000 మంది పర్యాటకులను పరిమితం చేసింది. 2022తో పోలిస్తే ఇది సుమారు 50 శాతం ఎక్కువ. దీనర్థం ఏమిటంటే.. ప్రతి భక్తుడికి అసలైన దర్శనం ఐదు సెకన్ల కంటే ఎక్కువ ఉండదని. అది కూడా పోలీసులు గెంటివేయకపోతే.

ఈ సందడికి తగినట్టుగానే మన దేవతలు కూడా ఓవర్ టైం పనిచేయాల్సి వస్తున్నది. అంతేకాదు, వారి మధ్యాహ్న భోజన, విశ్రాంతి సమయాలు తగ్గిపోయాయి. ఆన్‌లైన్ పూజలు రాత్రంతా కొనసాగుతూనే ఉంటాయి. ఎక్కడా ఎడతెరపి అనేది లేకుండా తెల్లవారుజాము దర్శనంతో మరో రోజు ప్రారంభమవుతుంది. మన ఆధ్యాత్మికత ఎంత లోతుల్లోకి పడిపోయిందో చెప్పేందుకు ఈ శ్రద్ధారాహిత్యమే నిదర్శనం.

మన దేవతలు సజీవ రూపాలా లేక రాళ్లా? ప్రాణ ప్రతిష్ఠ మంత్రాలు దైవత్వాన్ని వాటిలోకి ఆవాహన చేస్తాయా, లేదా? కేదార్‌నాథ్ ఆలయ గోడలపై ప్రదర్శించే లేజర్ షోలు కూడా భక్తేనా?



అయోధ్యలో బాలరాముడి ప్రతిష్ఠాపన సమయంలో దాని ప్రభావం గురించిన ఉపన్యాసాలు విన్నాం. చార్‌ధామ్‌లోని దేవతా విగ్రహాలు చాలా పురాతనమైనవి. ఈ టూరిజం దూకుడు ఓవైపు కొనసాగుతుండగా.. అట్టడుగు వర్గాలవారు, గ్రామస్థులు, అసలైన భక్తులను ఈ హడావుడి అడ్డుకుంటున్నది. దైవ దర్శనానికి అనుమతించాలని వారు వేడుకుంటున్నారు. అయినా కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న ప్రపంచంలో వాళ్లు నివసించనందున, ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ గురించిన అవగాహన లేని కారణంగా వారిని తిరస్కరిస్తున్నారు. అంతేకాదు, కాలినడకన తీర్థయాత్ర చేయాలని విశ్వసించేవారి కోసం నడక మార్గం కూడా లేదు. ఎందుకంటే, వాహనాల రాకపోకలను సులభతరం చేసేందుకు తీసుకొచ్చిన చార్‌ధామ్ ప్రాజెక్టు (సీడీపీ)లో భాగంగా చేపట్టిన రోడ్డు విస్తరణకు దాన్ని బలి చేయాల్సి వచ్చింది.

విపరీతమైన వేడి, కొండచరియలు విరిగిపడటం, అడవిలో మంటలు, నీటి సంక్షోభం, హిమాలయాల్లో పర్యాటక సంబంధిత నిర్మాణాల తాకిడి మధ్యనే ముఖ్యంగా నిషేధిత వరద ప్రాంతంలో రహదారుల మంత్రిత్వ శాఖ ఇప్పటికీ 12 మీటర్ల వెడల్పు ఉండే రహదారి నిర్మాణాన్ని కొనసాగిస్తున్నది. ఈ వెడల్పు రోడ్లు ప్రత్యేకంగా రోజుకు 10,000 ప్యాసింజర్ కార్ యూనిట్ల (పీసీయూ)ను దృష్టిలో పెట్టుకొని వేశారు. అయితే ఈ ఇరుకైన లోయల్లో వాహనాలు ఎక్కువగా ఇరుక్కుపోతుండటంతో పర్యాటకుల రాకపై ప్రభుత్వం పరిమితి విధించింది. ప్రస్తుతం ఒక రోజుకు సగటున 5 వేల పీసీయూల కంటే తక్కువ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. అయినప్పటికీ గౌరీకుండ్ నుంచి 10 కిలోమీటర్ల వరకు, కేదార్‌నాథ్ దిగువన 30 కిలోమీటర్ల మేర ట్రాఫిక్‌జామ్ ఏర్పడుతున్నది. 2013లో వరదలు సంభవించి వందల మంది ప్రాణాలు కోల్పోయిన ప్రాంతం ఇదే కావడం గమనార్హం.

కొండలు, లోయల్లోని ఇరుకైన రహదారుల్లో ఉండే పరిమిత వాహక సామర్థ్యం ఎక్కువగా ఉల్లంఘనలకు గురవుతున్నది. ఈ రహదారిని నిర్మిస్తుండటం వల్ల కొండచరియలు విరిగిపడి ప్రమాదాలు జరుగుతున్నాయి. కొండవాలు స్థిరీకరణ కోసం ఇటీవల అదనంగా రూ.1,400 కోట్ల ప్రజా సొమ్మును ప్రభుత్వం విడుదల చేసింది. 40 మంది కూలీలు సజీవంగా చిక్కుకుపోయిన సిల్క్యారా సొరంగాన్ని నిపుణుల బృందం పర్యవేక్షించింది. 12 మీటర్ల వెడల్పే ఆ ప్రమాదానికి ప్రధాన కారణమని ఆ బృందం తేల్చిచెప్పింది. మన విధ్వంసానికి మనమే నిధులు సమకూరుస్తున్నాం. ఇది ఒక విషపు వలయం.

**ఆధ్యాత్మిక పర్యాటకం అనే పదబంధమే ఒక వింత. ఆధ్యాత్మిక పర్యాటకులు ఒక్కో ధామ్‌లో ప్రతిరోజూ 10 వేల కిలోల చెత్తను వేస్తున్నారు. రహదారి పక్కన, గంగా నది ఒడ్డున వారు కాలకృత్యాలు తీర్చుకుంటున్నారు. కదిలే కార్ల నుంచి సీసాలు, స్టైరోఫోమ్ ప్లేట్లను (మెరిసే ప్లేట్లు) విసిరివేస్తున్నారు. అంతేకాదు, ఎక్కువ శబ్దం వచ్చేలా పాటలు పెట్టడం.. పర్వతాలు, పుణ్యక్షేత్రాలు బ్యాక్‌గ్రౌండ్‌లో కనిపించేలా బట్టలు విప్పి సెల్ఫీలు తీసుకోవడం తమ హక్కుగా భావిస్తున్నారు. అరుదైన పైన్, సిల్వర్‌ఓక్ చెట్లు, పర్వత ప్రాంతాల్లో జీవించే జంతువుల మధ్యనే పెద్దపెద్దగా చప్పుడు చేసే హారన్‌లు మోగిస్తున్నారు. హిమాలయాలను అపవిత్రం చేయడం, హిమాలయాలను అమ్ముకోవడంలో ఆధ్యాత్మికత ఏముంది?**

ఐదు ట్రిలియన్ డాలర్ల భావన మన కండ్లకు గంతలు కట్టకముందు ఈ విధానం భిన్నంగా ఉండేది. పర్వత ప్రాంతాల్లోని గ్రామస్థులు బగ్యాల్‌పై (పర్వత ప్రాంతాల్లో ఉండే పచ్చికబయళ్లు) బూట్లు ధరించి నడవరు. దేవతల సన్నిధిలో ఉన్నప్పుడు తమ స్వరం పెంచి మాట్లాడరు. కాలకృత్యాలు తీర్చుకొని, ఆ పవిత్ర స్థలాలను కలుషితం చేయాల్సి వస్తుందేమోననే భయంతో ధామ్‌లలో రాత్రిపూట ఆగరు. ప్రకాశవంతమైన దుస్తులను ధరించడాన్ని కూడా వారు అగౌరవంగా భావిస్తారు. స్వామి వివేకానంద లాంటి సంతు సాధువులకు రిషికేష్ ఒకప్పుడు ధ్యాన కేంద్రం. గంగా నదిలో కనిపించే చేపలకు అప్పట్లో చేతితోనే మేత వేసేవారు. నీళ్లు తాగేందుకు అక్కడికి ఏనుగులు వచ్చేవి. ఈ దృశ్యాలు, స్వచ్ఛమైన గంగా జలాలను చూసి వారు ఆనందించేవారు.

ఇదంతా సనాతన ధర్మం పేరిట జరుగుతున్నందున దాని గురించి స్పష్టత ఇవ్వాలి. ఒక దాన్ని చూసి 'నేను దీన్ని ఎలా పెంచగలను?' అని సనాతన ధర్మం అనుకుంటుంది. కానీ, 'న్యూ ఇండియా'లో ఆధునిక మానవుడు ఏదైనా ఒక వస్తువును చూసి.. 'నేను దీన్ని ఎలా వినియోగించగలను?' అని అనుకుంటున్నాడు. ఆధునిక భారతదేశం అమర గంగానదిని సొరంగంలా మార్చడానికి, చార్‌ధామ్‌ను చార్ దామ్ (నాలుగు రాళ్లుగా చేసుకొని అమ్ముకోవడం) గా మార్చడానికి, హిమాలయాలను దుమ్ము, ధూళితో కూడిన మట్టికుప్పగా మార్చేందుకు సిద్ధంగా ఉంది. ఒక వస్తువు ధర తప్ప, దాని విలువ తెలియని స్థితికి మనం చేరుకున్నాం. మహోన్నత వారసత్వ సంపద, విజ్ఞానాన్ని మనం వదిలేసుకుంటున్నాం.

('ది వైర్' సౌజన్యంతో)